క్లుప్తంగా

సేవాకార్యక్రమాలు అభినందనీయం



గణపవరం బస్టాండు వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాము తదితరులు

గణపవరం: గణపవరంలోని స్నేహ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని గణపవరం మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము అన్నారు. శనివారం గణపవరం బస్టాండు వద్ద ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. దశాబ్ద కాలంగా బస్టాండు వద్ద ప్రతి వేసవిలో ఈ చలివేంద్రం ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడుతోందని ఆయన అన్నారు. తొలిరోజు గణేష్ రెస్టారెంట్ సహకారంతో రస్నా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటోయూనియన్ అధ్యక్షుడు తంగెళ్ల అంజి, కార్యదర్శి సకలాబత్తుల కన్నా పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి సామూహిక పూజలు



జల్లికొమ్మరలో పూజలు చేస్తున్న గ్రామస్తులు

గణపవరం: గణపవరం మండలం జల్లికొమ్మరలో నూతనంగా నిర్మించిన 45 అడుగులు భారీ అంజనేయస్వామి విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గ్రామంలో మంచి నీటి చెరువు గట్టున రూ.50 లక్షల విరాళాలతో ఏర్పాటుచేసిన ఈ విగ్రహాన్ని హనుమజ్జయంతి సందర్భంగా ఈనెల 14వ తేదీ ఆదివారం 9.24 గంటలకు ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా మూడు రోజులుగా ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద పూజలు, హోమాలు నిర్వహిస్తున్నారు. పెద్ద సంఖ్యలో దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఆదివారం విగ్రహావిష్కరణ అనంతరం అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ కురెళ్ల వెంకటరత్నం తెలిపారు.

నారాయణపురం మాజీ సర్పంచి గణేశ్వరరావు మృతి



ఉంగుటూరు: నారాయణపురం మాజీ సర్పంచి పెద్దిరెడ్డి గణేశ్వరరావు (73) శనివారం వేకువజామున మృతి చెందారు. గణేశ్వరరావు 2004 నుంచి 2009 వరకు గ్రామ సర్పంచిగా పనిచేశారు. అప్పటి ఎమ్మెల్యే, మాజీ మంత్రి వట్టివసంతకుమార్ సహకారంతో గ్రామంలో ఇందిరమ్మకాలనీకి 16 ఎకరాలు భూసేకరణ చేసి 672 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, గ్రామస్తులు తదితరులు గణేశ్వరరావు భౌతిక కాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశానికి అవకాశం

దెందులూరు: గోపన్నపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో ఒకటో తరగతిలో ప్రవేశానికి షెడ్యూల్ ట్రైబుకు చెందిన ఒక సీటు ఖాళీ ఉందని ప్రిన్సిపల్ ఎస్.నాగేంద్రకుమార్ అన్నారు. ఆయన శనివారం కేంద్రీయ విద్యాలయంలో మాట్లాడుతూ అర్హతలు, నిబంధనలు అనుసరించి షెడ్యూల్ ట్రైబ్ విద్యార్థి ఒకటో తరగతి ప్రవేశానికి 2023 మార్చి 31 నాటికి ఆరేళ్లు నిండి ఉండాలన్నారు. సోమవారం సాయంత్రం (15) 4 గంటలలోపు అన్ని ధ్రువపత్రాలతో కేంద్రీయ విద్యాలయంలో 1వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ అన్నారు.

'జగనన్నకు చెబుదాం'పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



గ్రామాధికారులతో సమావేశం నిర్వహించిన తహసీల్దార్ సోమశేఖర్

ఏలూరు రూరల్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై గ్రామ రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తహసీల్దార్ బి సోమశేఖర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ, వీఆర్వో, సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి 1902 నెంబర్ ద్వారా ఫిర్యాదు కార్యక్రమం చేపట్టారని, ఈ కార్యక్రమం ద్వారా అందే ఫిర్యాదులను అధికారులు సత్వరం పరిష్కరించాలన్నారు. ఒకవేళ ఫిర్యాదు పరిష్కారం కాకపోతే, ఎందుకు కాలేదో, కారణం ఏమిటో అధికారులు చెప్పాలన్నారు. అధికారులు సైతం సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. గ్రామాల్లో చేపట్టిన ఫీల్డ్ ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ సైతం వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి భూ రికార్డులు పరిశీలించాలన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన

- రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



పెదపాడు మండలంలోని ఏపూరులో మహిళలకు పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కొఠారు

పెదపాడు: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదపాడు మండలంలోని ఏపూరులో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు నేరుగా లబ్ధిదారులకు సక్రంగానే అందుతున్నాయా అని ప్రశ్నించారు. ప్రజలు అడిగిన వెంటనే సంబంధిత సమస్యల పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తాము అండగా నిలుస్తామని చెప్పారు. ప్రజలకు జగనన్న సంక్షేమ పథకాలు అందిస్తుంటే కొంత మంది స్వార్థపరులు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ప్రజలు ఏమి అవసరమో పాదయాత్ర ద్వారా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తెలుసుకుని నవరత్నాల ద్వారా పథకాల రూపంలో అందిస్తున్నారని గుర్తు చేసారు. సిఫారసులు, దళారీలు లేకుండా సచివాలయం, గ్రామ వలంటీరు వ్యవస్థల ద్వారా నేరుగా ఇంటి ముందుకే పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. నియోజకవర్గంలో రూ. కోట్ల వ్యయంతో రహదారులు నిర్మించామన్నారు. మిగిలిన రహదారులను కూడా త్వరలో పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఎల్లో మీడియా, చంద్రబాబు అనుచర గణం ఎన్ని అబద్ధాలు చెప్పినా ప్రజలు నమ్మే ప్రసక్తే లేదన్నారు. ఎవరు మంచి చేసారో ప్రజలు గమనించాలని కోరారు. ఈకార్యక్రమంలో స్థానిక ఎంపీపీ బత్తుల రత్నకుమారి, జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, గ్రామ సర్పంచ్ చోడగిరి రామకృష్ణ, ఎంపీటీసీలు నాగమల్లేశ్వరరావు బెజవాడ శిరీషా శేఖర్, స్థానిక బెజవాడ నర్సింహరావు, బెజవాడ సత్యన్నారాయణ, చోడగిరి బిక్షాలు పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణ పనులు పూర్తి



పూళ్లలో విద్యుత్ స్తంభాలను పాతుతున్న సిబ్బంది



విద్యుత్ స్తంభాలు తరలిస్తున్న దృశ్యం



విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

- రెండు రోజుల పాటు శ్రమించి పూర్తి చేసిన అధికారులు
- మంచినీటి పథకాలకు విద్యుత్ సరఫరా
- గ్రామాల్లో తొలగిన అంధకారం

భీమడోలు: గాలి వాన బీభత్సానికి అతలాకుతలమైన బాధిత గ్రామాల్లో రెండు రోజులుగా విద్యుత్ శాఖ అధికారులు శ్రమించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ధ్వంసమైన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి అంధకారంలో ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను శనివారం రాత్రికి పూర్తి చేసారు. రెండు రోజులుగా విద్యుత్ శాఖ సిబ్బంది శ్రమించి పనులు పూర్తి చేసారు. దీనితో గృహ విద్యుత్, మంచినీటి పథకాలకు త్రీఫేజ్ విద్యుత్‌ను సరఫరా చేసారు. దీనితో ప్రజలంతా ఊరట చెందారు. రెండు రోజులుగా విద్యుత్ శాఖ ఎస్ఈ పి.సాల్మన్‌రాజు ఆదేశాల మేరకు డీఈ టి.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఏడీఈ కె.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో భీమడోలు, ద్వారతిరుమల మండలాల సబ్‌స్టేషన్స్‌అధికారులు, సిబ్బంది పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేసారు. గాలి వాన భీభత్సానికి పూళ్ల, అంబర్‌పేట సబ్‌స్టేషన్ పరిధిలోని పూళ్ల, ఎంఎంపురం, కోడూరుపాడు, దుద్దేపూడి, అన్నేవారిగూడెం, కురెళ్లగూడెం గ్రామాల్లోని 110 విద్యుత్ స్తంభాలు విరిగిపోగా, 10 ట్రాన్స్‌ఫార్మర్లు పూర్తిగా నేలమట్టమై పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు బాధిత గ్రామాలను పరామర్శించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సత్వరమే విద్యుత్ సరఫరా పనులు పూర్తి చేయాలని సంబంధిత ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. దీనితో పనులు ఊపందుకున్నాయి. మంచినీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. దీనితో విద్యుత్ సరఫరాపై సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు హుటాహుటిన కొత్త విద్యుత్ స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్లను సమకూర్చారు. వాటిని యంత్రాల సాయంతో స్తంభాలు పాతి వాటిని విద్యుత్ కనెక్షన్లు పునరుద్ధరించారు. కురెళ్లగూడెం, పూళ్ల, కోడూరుపాడు, దుద్దేపూడి, అన్నేవారిగూడెం, దుద్దేపూడి గ్రామాల్లోని ప్రజలకు మంచినీటిని అందించారు. పూళ్ల సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ ఆధ్వర్యంలో మంచినీటి పథకాలకు మోటార్లు బిగించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకున్నారు. శనివారం వాటి పనితీరును సంబంధిత అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈలు రామస్వామి, భీమేశ్వరరావు, స్వామి, రాజ్‌కుమార్, సబ్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వ్యాకుల మాత వార్షికోత్సవం



కొవ్వలిలో వ్యాకులమాత ప్రతిమతో ఊరేగింపు

దెందులూరు: కొవ్వలిలో వ్యాకులమాత 9వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పోతునూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ పీ. డేవిడ్‌రాజు, కొవ్వలి ఆర్‌సీఎం సంఘ పెద్దలు, సంఘస్తులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. తొలుత వ్యాకులమాత ప్రతిమతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. గుండుగొలను ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జయప్రకాష్, అల్లిపల్లి చర్చి ఫాదర్ నిట్టా రాజేష్, పోతునూరు ఫాదర్ డేవిడ్‌రాజు ప్రత్యేక దివ్యబలిపూజా అర్పించారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన తరగతులు



పూళ్లలో ప్రపంచ పటానికి రంగులద్దిన చిన్నారులు



పోతునూరు గ్రంథాలయంలో మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు

భీమడోలు: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆరవ రోజైన శనివారం నిర్వహించిన విద్యా సంబంధ విషయాల్లో చిన్నారులంతా ఉత్సాహంగా పాల్గొని ఔరా అనిపించారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 40 మంది చిన్నారులు నీతి కథలు చెప్పడం, వినడం, సమీక్షలు రాయడం, ఇంగ్లీష్, తెలుగు పదాలపై పట్టు సాధించేలా ప్రశ్నలు వేసారు. చిన్నారులంతా నీతి కథలు చెప్పారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ నీతి కథలను వివరించారు. యోగా ట్రైనర్ భావన రుషి చిన్నారులకు యోగాసనాలపై శిక్షణ అందించారు. చిన్నారులు క్యారమ్స్, కబడ్డీ వంటి క్రీడలు ఆడారు. పూళ్ల గ్రంథాలయంలో గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఆధ్యాత్మిక ట్రైనర్ గేదెల ఈశ్వరీ, యోగా ట్రైనర్ కురెళ్ల కిషోర్ చిన్నారులకు చక్కని తర్ఫీదును అందించారు. ఈ కార్యక్రమంలో గుండుగొలను గ్రంథపాలకురాలు జి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు విజయవంతం

దెందులూరు: జిల్లాలో అన్ని గ్రంథాలయాల్లో గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల మానసిక అభివృద్ధి, విజ్ఞానం పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరాలు విజయవంతమయ్యాయని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శేఖర్‌బాబు అన్నారు. శనివారం పోతునూరు గ్రంథాలయంలో విద్యార్థుల నిర్వహిస్తున్న ప్రత్యేక వేసవి శిక్షణ తరగతులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈ తరగతులను సద్వినియోగం చేసుకుని విజ్ఞానవంతులు కావాలన్నారు. అనంతరం పోతునూరు గ్రంథాలయాన్ని పరిశీలించి గ్రంథాలయాధికారి డీ.జాన్ బాబు విధి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

గరికపాటికి ఘన సత్కారం



గరికిపాటిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదపాడు: పద్మశ్రీ అవార్డు గ్రహీత, అవధాని గరికిపాటి నర్సింహారావును ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి శుక్రవారం రాత్రి ఘనంగా సత్కరించారు. పెదపాడు మండలంలోని అప్పనవీడు అభయాంజనేయస్వామి జయంతిని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఉత్సవాల్లో గరికిపాటి ప్రవచనం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా గరికిపాటి ప్రవచనాన్ని ప్రజలు శ్రద్ధాశక్తులతో ఆలకించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరితో పాటు పెదపాడు మండల కన్వీనర్ అప్పన ప్రసాద్, పెదపాడు జెడ్పీటీసీ ఘంటా పద్మశ్రీ ప్రసాదరావు, ఎంపీపీ బత్తుల రత్నకుమారి, ఎంపీటీసీ బుద్దే రామసీత, నెర్సు నాగభూషణం, చోడగిరి బిక్షాలు, నూలు నర్సింహారావు పాల్గొన్నారు,

నిప్పు పెడితే ముప్పే

- పొలాల్లో ఎండుగడ్డిని తగలబెట్టొద్దు
- భూసారానికి నష్టం
- వ్యవసాయాధికారుల సూచన



చేలల్లో వరి గడ్డిని తగలబెట్టిన దృశ్యం

పెదవేగి: వరి కోతలు పూర్తయ్యాక చేలల్లో మిగిలిపోయిన ఎండిగడ్డిని అక్కడే తగలబెడితే భూసారానికి తీవ్రనష్టం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రైతులకు దీనిపై అవగాహన లేకపోవడంతో ప్రసుత్తం ఎక్కడ చూసినా ఎండుగడ్డిని తగల బెడుతున్నారు. ఈ విధంగా గడ్డిని తగలబెడితే భూమి పైపొరల్లో ఉన్న విలువైన సూక్ష్మ పోషకాలు, మిత్ర పురుగులు నాశనమవుతాయని, అంతే కాకుండా పర్యావరణానికి ప్రమాదకరమని పెదవేగి మండల వ్యవసాయాధికారిణి ఎం ప్రియాంక చెబుతున్నారు. దీనిపై ఇప్పటికే రైతులకు అవగాహన కల్పిస్తున్నామని ఆమె వివరిస్తున్నారు.

సారమంతా పైపొరల్లోనే...

వ్యవసాయ భూముల్లో సారవంతమైన మట్టి, సూక్ష్మ పోషకాలు, వాటిని తయారు చేసే పలు రకాల జీవుల ఆవాసం భూమి పైపొరల్లోనే ఉంటుందని ఏవో తెలిపారు. కోతలు పూర్తయ్యాక ఎండు గడ్డిని తగలబెడితే ఆ వేడి ప్రభావం కారణంగా పంటకు అవసరమైన భూభౌతిక స్థితిని భూమి కోల్పోతుందన్నారు. తగలబెట్టిన భూమిలో సేంద్రియ కర్బన స్థితి కన్పించదన్నారు. నేల పీహెచ్ లెవెల్ కూడా పడిపోతుందన్నారు. వర్షాలు కురిసిన వెంటనే దున్నేసుకోవచ్చునని, తెగుళ్లు వ్యాపించే పురుగులు చనిపోతాయని రైతులు అపోహపడుతున్నారన్నారు. ఎండుగడ్డిని తగలబెట్టడం వల్ల మేలు కంటే కీడే ఎక్కువని గుర్తించాలన్నారు. గడ్డిని తగలబెట్టిన భూమి, తగలబెట్టని భూమిలో పంట ఆరోగ్యం పరిశీలించి స్వయంగా రైతులే తెలుసుకోవచ్చని వివరించారు. వివిధ రకాల జీవాలు, బ్యాక్టీరియా వంటివి మంటల్లో కాలిపోతాయని చెప్పారు. మళ్లీ సదరు భూమిలో ఇవన్నీ చేరాలంటే చాలాకాలం పడుతుందన్నారు. అంత వరకు ఆ భూమిలో సాగు చేసే పంటలకు అధిక మొత్తంలో ఎరువులు, పురుగు మందులు వినియోగించాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం ఖర్చు తగ్గుతుందని రైతులు ఆలోచిస్తే భవిష్యత్తులో ఆ ఖర్చు పురుగు మందులు, ఎరువులపై ఖర్చు పెట్టాల్సి వస్తుందని ఏవో హెచ్చరించారు.

భూమి సహజ స్థితిని కాపాడుకోవాలి

పంట దిగుబడి సక్రమంగా రావాలంటే భూమి సహజ స్థితిని కాపాడుకోవాల్సి ఉంటుందని ఏవో తెలిపారు. అందుకోసం వేసవిలో లోతు దుక్కి చేయడం, పచ్చిరొట్ట సాగు చేయడం చేపట్టాలన్నారు. సేంద్రియ ఎరువులను వినియోగించుకోవాలన్నారు. తద్వారా భూమి తన సహజ స్థితిలో ఉండి పంట దిగుబడి బాగా వస్తుందన్నారు. రైతులకు వివిధ రకాల తెగుళ్లను అరికట్టడానికి పెట్టే ఖర్చు కూడా తగ్గుతుందని వివరించారు.

ఆటోను ఢీకొట్టిన కారు

ఆరుగురికి తీవ్రగాయాలు



గుండుగొలను హైవే వద్ద బోల్తా పడ్డ ఆటో

భీమడోలు: గుండుగొలను శివారున జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం ఓ ఆటోను గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడింది. ఆటో డ్రైవర్‌తో పాటు ఐదుగురు మహిళలకు తీవ్రంగా, మరో ఆరుగురు మహిళలకు స్వల్పంగా గాయాలయ్యాయి. వీరిని రోడ్డు సెఫ్టీ పోలీసులు, హైవే అంబులెన్స్ అధికారులు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హనుమాన్ జంక్షన్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తిని పరామర్శించేందుకు కైకరం నుంచి అతని బంధువులయిన 11 మంది మహిళలు కిరాయి ఆటోలో బయలుదేరారు. గుండుగొలను వైపుగా వెళ్తున్న ఆటోను తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వైపుగా వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టి పరారైంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ధర్మతో పాటు చిగురుపల్లి సుశీల, రాగోలు నాగమణి, చింతాడ అమ్మాజీ, కొటికల సత్యవతి, జాకా చిన్నమ్ములకు తీవ్ర గాయాలయ్యాయి. భీమడోలు పోలీసులు ఘటనా స్థలిలో విచారణ చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ఏలూరు రూరల్ : పోణంగిలో ఆర్ఎస్ నెంబర్ 214–1లో 4.40 సెంట్లు ప్రభుత్వ భూమి ఆక్రమించేవారిపై చర్యలు తీసుకోవాలని వీఆర్వో ఎం శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల ప్రభుత్వం ఈ భూమిలో లే–అవుట్ వేసి పేదలకు స్థలాలు పంపిణీ చేసిందన్నారు. కొద్దిరోజుల క్రితం కొందరు వ్యక్తులు లే–అవుట్ భూమిలో మొక్కలు నరికి కాల్చివేసారని ఫిర్యాదులో వివరించారు. అధికారులు పాతిన సర్వే రాళ్లు సైతం తొలిగించి ఆక్రమించేందుకు ప్రయత్నించారని వెల్లడించారు.

దెందులూరు ఏఎంసీకి ఆర్వో ప్లాంట్ మంజూరు

పెదవేగి: రైతులు, హమాలీల కోరిక మేరకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి లక్ష్మిపురంలోని ఏఎంసీ కార్యాలయంలో రూ. 2.50 లక్షలతో ఆర్వో ప్లాంటు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్ అన్నారు. శనివారం ఏఎంసీ కార్యాలయంలో ఆర్వో ప్లాంటు నిర్మాణానికి స్థల పరిశీలన, పారిశుద్ధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల రైతులు, హమాలీలు, ఉద్యోగులకు ఈ ఆర్వో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ఏఎంసీ, రైతులు, హమాలీల తరపున ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి చైర్మన్ అప్పనప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు గొల్లగూడెంలో ఐలమ్మ విగ్రహావిష్కరణ

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం గొల్లగూడెంలో ఆదివారం ఉదయం 10 గంటలకు చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ నిర్వహిస్తున్నట్లు అఖిల భారత దోబి మహా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జొన్నాడ శ్రీనివాసు తెలిపారు. ఈ విగ్రహాన్ని రాష్ట్ర రజక సంఘం కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత ప్రముఖుడు వేమలపల్లి సుధీర్ పాల్గొంటారని, రజక సంఘం రాష్ట్ర, జిల్లా సంఘం నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

97 మందికి వైద్య సేవలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : రామచంద్రరావు పేటలోని శ్రీ కృష్ణ హాస్పిటల్‌లో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 97 మందికి వైద్యసేవలందించారు. డాక్టర్ అఖిల, నాగేశ్వర రావు, ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు టి.అబ్రహం లింకన్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారం

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : జిల్లాలోని భీమడోలు మండలంలో గురువారం సంభవించిన ఈదురుగాలులు, సుడిగాలి, భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల కారణంగా నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను శనివారం పునరుద్ధరించినట్లు ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.సాల్మన్ రాజు తెలిపారు. ఈ మేరకు మండలంలోని కురెళ్ళగూడెం, లింగంపాడు, దుద్దేపూడి, అంబర్‌పేట, కోడూరుపాడు, పూళ్ళ, ఎంఎంపురం తదితర గ్రామాల్లో 110 విద్యుత్ స్తంభాలు, 15 కిలోమీటర్ల మేర లైను, 10 పరివర్తకాలు దెబ్బతిన్నాయన్నారు. తమ యంత్రాంగం వాటిని సరి చేసి అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారని, విద్యుత్ సరఫరాలో ఇంకా ఏమైనా అంతరాయాలు ఉన్నా సంబంధిత విద్యుత్ సిబ్బందికి తెలియచేసిన వెంటనే వాటిని కూడా సరిదిద్దే ఏర్పాటు చేస్తామన్నారు.

రైతులకు పట్టాలు మంజూరు చేయాలి

దెందులూరు: చుక్కల భూమి పత్రాలు మంజూరు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దళితసేన రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు. దళిత, వెనుకబడిన వర్గాల రైతులు సాగు చేసుకోవడానికి సాగు పట్టాలు మంజూరు చేయాలని అవగాహన యాత్రలో భాగంగా శనివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ దళితులు, వెనుకబడిన వర్గాల రైతులు పూర్వం నుంచి నేటి వరకు ప్రభుత్వ భూములు సాగు చేసుకునే రైతులకు మానవతా దృక్పథంతో సాగు పట్టాలు మంజూరు చేయాలన్నారు. తద్వారా వారి జీవన విధానం మెరుగుపడి సామాజిక, ఆర్థిక పరంగా లబ్ధి, అభివృద్ధి లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఈ దిశగా ప్రజాప్రతినిధులు వచ్చే అసెంబ్లీ ఎన్నికల లోపు చట్టం తీసుకురావాలని ఆయన కోరారు.

38 కేసుల పరిష్కారం

గణపవరం: తాడేపల్లిగూడెం కోర్టులో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. గణపవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని 38 కేసులు లోక్ అదాలత్‌తో రాజీ అయినట్లు ఎస్సై వేముల వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

పెదవేగి : భర్త వేధింపులకు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపారు. కుచింపూడికి చెందిన వివాహిత రామానుజం అన్నవరం (32) భర్త లక్ష్మణ వేధింపులకు తట్టుకోలేక ఈ నెల 10 ఇంట్లో ఉరి వేసుకుంది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తంలో ఏలూరులోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందడంతో శనివారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

విషప్రయోగంతో చేపలు మృతి

జంగారెడ్డిగూడెం: స్థానిక అక్కమ కోనేరు చెరువులో విషప్రయోగం కారణంగా చేపలు మృతిచెందాయి. రజక సంఘం పట్టణ అధ్యక్షుడు వడిగల శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. కోనేటి చెరువును 60 ఏళ్లుగా రజకులు వృత్తితో పాటు చేపల సాగుకు వినియోగిస్తున్నారు. ఈ చెరువులో మూడు నెలల క్రితం రూ.3 లక్షలు విలువైన చేప పిల్లలను వేశారు. శనివారం ఉదయం చెరువులో చేపలు తేలిపోయి కనిపించాయి. చెరువలో విషప్రయోగం జరిగినట్టు గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయగా ఎస్సై ఎం.సాగర్ బాబు కేసు దర్యాప్తు చేపట్టారు.